కళ్లెంజారినగుఱ్ఱం

సూర్యాస్తమయమయి చీకటి పడుతూంది. రమణారావు రోజూలాగున స్నేహితులవద్దకో, షికారుగా తిరిగి రావడానికో సాయంకాలం వెళ్లలేదు. ఇంటి ముందున్న ఆవరణలోనే యింతసేపూ పచారుచేసి, వరండాలో లైటువేసి, పడక కుర్చీలో వాలి పత్రిక అందుకున్నాడు. పక్కనే చిన్నబల్లమీద వారపత్రికలూ, కథల పత్రికలూ మూడు నాలుగున్నాయి. ఏదో ఓ పత్రిక అందుకున్నాడేగాని, ఏమంత ఆసక్తితో చదువుతున్నట్టు లేదు. పొద్దున్నే, ఆఫీసు పనిమీద వెళ్లకముందే, ప్రధానవార్తలూ, శీర్షికలూ దినపత్రికలో చూడడం, రాత్రి తీరుబడిగా మిగతా వార్తలూ, వ్యాసాలూ, ఏవేనా వారపత్రికలూ చదవడం, అతనికిన్నీ చాలామంది వలెనే అలవాటు.

ఇవాళ సాయంకాలం వాహ్యాళికి వెళ్ళకుండా అతను యింట్లోనే వుండడానికి కారణం- అతనిభార్య, శారద, పేరంటాలకి వెళ్లడం. ఇంట్లో అతనూ, భార్యాతప్ప పెద్దవాళ్లింకెవరూ లేరు. "నేనొచ్చేవరకూ పనిమనిషిని వుండమన్నాను; పిల్లలను చూస్తూంటుంది లెండి. లోపల గదితాళం వేసుకుని కాస్త అలా తిరిగిరండి"అని శారద చెప్పే వెళ్ళింది. కాని, తప్పనిసరి అయితే తప్ప, యింట్లో తమ యిద్దరిలో ఒకరైనా లేకుండా పిల్లల్ని విడిచివెళ్ళటం అతని కంత మనస్కరించదు. అందుచేత పచారుచేస్తూ యింట్లోనే వుండిపోయాడు.

శారద అయిదుగంటలు కాకుండానే బయలుదేరింది. ఇప్పుడు ఏడుగంటలు దాటుతూంది. పసుపూకుంకానికి వెళ్లి అక్కడినుంచి ఆలస్యంకాకపోతే, క్రిందటివారం కూడా వెళ్ళలేదు గనుక, ఒక్కక్షణం మహిళాసమాజానికి కూడా వెళ్ళివస్తానంది. పిల్లలందరికీ చాకొలేటుబిళ్ళలు ఇచ్చి, అల్లరి చేయవద్దని చెప్పి, 'జాగ్రత్తగా ఆడించవే' అని పనిమనిషిని హెచ్చరించే వెళ్ళింది. పిల్లలు ముగ్గురూ కూడా ఓగంటసేపు సరదాగానే ఆడుకున్నారు. కాని, సంజవేళ అయింది మొదలు "అమ్మేదీ?" అంటూ ఆరంభించారు. "ఇప్పుడే వచ్చేస్తుంది; బిళ్ళలిచ్చి వెళ్ళిందికాదూమరి, ఆడుకోండి" అంటూ సముదాయించాడే కాని ప్రతి అయిదునిమిషాలకూ "అమ్మేది" అనే ఆలాపన మానారుకాదు! ఇప్పుడే, కాస్తసేపయి పనిమనిషి చెబుతున్న కబుర్లో కథలో వింటూ పెరటి వసారాలో చాపమీద కూర్చున్నారు.

రమణారావుకూ ఏమిటో యింట్లో వెలితిగానే అనిపించింది. దృష్టి అట్టే నిలవకుండానే పత్రికలో వార్తలు అక్కడా, అక్కడా చదవసాగాడు. "......బస్తీలో రిక్షాప్రమాదం" అన్న చిన్న శీర్షికచూచి ఘుతుక్కుమన్నాడు. ఏదో ఆందోళనతో చదవసాగేడు. వేగంగా వెళుతూన్న లారీ ఒక్కసారిగా పక్కవీధిలోకి మలుపుతిరిగిందనీ, పక్కనుండివస్తున్న రిక్షాకు లారీ వెనుక

ఉపమర్తి రామారావు

భాగం తగిలిందనీ, రిక్షా బాగా దెబ్బతిన్నదనీ వుంది. అందులోని స్త్రీకి తీవ్రమైన గాయాలు తగిలినవి; ఆసుపత్రిలో చేర్చబడినది. దైవవశాత్తు ఆ స్త్రీ ఒడిలోని బిడ్డకు అపాయమేమీకలగలేదు; రిక్షావానికి కూడా పెద్దగాయాలేమీ కలగలేదు: ఇదీ వార్తాసంగ్రహం. శారదకూడా యిందాక రిక్షామీదే వెళ్ళింది. కొంపతీసి తోవలో మరేం చిక్కు రాలేదుకదా! గదిలో వాచీ వేపు చూశాడు. ఏడుంపావయింది. ఎప్పుడు వెళ్ళినా చీకటి పడకుండా వచ్చేస్తూండేదే; ఎందుచేత చెప్మా యింత ఆలస్యం? పేరంటంనుంచి మహిళాసమాజానికి కూడా వెళ్లిందేమో? అయినా, ఈ పేరంటాల పిలుపులు కూడా కొంచెం హద్దులో వుండాలి! వీరున్న పేటకి వారున్న పేట మైలున్నర దూరంవుంది. దగ్గర బంధువులో, మరీ అంత సన్నిహితులో అవుతే తప్ప, యిలాంటి పిలుపులు ఏ పేట కాపేట వరకే సరిపుచ్చుకోరాదూ? ప్రతి చిన్న కార్యానికీ వూరందరినీ పిలవడమేమిటి? అయినా ఇరవై పాతికేళ్ళ క్రితంవలె కాక ఇప్పుడు ఊళ్ళన్నీ మహా పెరిగిపోయాయి; ఇప్పుడు ప్రతీపేటా ఒక బస్తీఅంత పెరిగింది అందులోనూ ఈ కార్లూ, లారీలూ మరీ విపరీతంగా పెరిగిపోయాయి. తన చిన్నప్పుడు వూరంతటికీ నాలుగుకార్లుండేవో లేదో; ఇప్పుడో? ఏ వీధినిచూచినా కార్లే! ఇక రద్దీచూస్తే రోడ్లమీద నడవడమంటేనే జంకుగా వుంటుంది. పోనీ, ఈ రద్దీకీ, కార్లకీ సరిపోయేటట్టు రోడ్లేమేనా విశాలము చేశారా అంటే అదీలేదు. ఊళ్లు పెరగటమే కాని, పెరుగుతూన్న పట్నాలకు తగిన మార్పులూ, సదుపాయాలూ ఏమీ పెరగడం లేదు. అందులో మన ఆంధ్రదేశపు పట్టణాలు మరీ అర్ధ్వాన్నం, ఈ విషయంలో. అబ్బే, ఏదో సందడిచేస్తూ సంతృప్తిపడడమే కాని పౌరసౌకర్యాలూ, బాధ్యతలూ నిదానంగా ఏమీ పట్టించుకోరు మన తెలుగువాళ్లు! రాక్షసుల్లాంటి లారీలేమిటి ఊరి మధ్యనుంచి? తానెన్నిసార్లు చూడలేదు, మంచి రద్దీగావున్న యిరుకు రోడ్లలో కూడా లారీలను కాస్త దుడుకుగానే పోనివ్వడం? ఆ మధ్య యిలాగే, చీకటిపడే వేళప్పుడు, నాలుగుమూరలు పైకివచ్చిన యినపకడ్డీలతో లారీ పోతూ, ఆ కడ్డీలుతగిలి సైకిలు ప్రమాదం జరగలేదూ? కొయ్యలూ, కడ్డీలూ అలా విస్తరించి వున్నప్పుడు, ఎఱ్ఱ దీపాలు పెట్టి, మరీ జాగ్రత్తతీసుకొని మెల్లగానే నా పోనివ్వాలి. ప్రమాదం జరిగితే ఓ ఘడియ 'అరెరె' అనుకోవడం, ముందు జాగ్రత్తవహించి నిదానంగా కట్టుదిట్టంగా ఏమీ ఆలోచనచేయకపోవడం మనకి పరిపాటయిపోయింది! ప్రమాదాలనుంచి పౌరబాధ్యతలవరకూ రమణారావు మనసు పరిపరివిధాలుగా పోసాగింది!

గడియారం ఏడున్నరగంట కొట్టింది; ఇదేమిటి, శారద యింకారాలేదు? రమణారావుకు ఆందోళన హెచ్చింది. తోవలో ఏ లారీకానీ?......ఛ,ఛ...అటువంటిదేదీ జరగనివ్వకు భగవంతుడా అని అప్రయత్నంగానే అనుకోసాగాడు. "అమ్మెప్పుడొస్తుంది"అని అతని రెండోబిడ్డ, చిట్టితల్లి, పనిమనిషిని అడగడం లోపలినుంచి వినిపించింది. అతనికి పిల్లలమీద జాలీ, శారదపై కొంచెం కోపం ఒక్కసారే కలిగాయి. లోపలికి వెళ్లాడు; చిన్నవాడు, అయిదేళ్లవాడు, నిద్రపోతున్నాడు, పెద్దవాడూ, చిట్టితల్లీ ఆవులిస్తూ పడుకోబోతున్నారు. "అమ్మయిప్పుడే

వచ్చేస్తుంది; నేనన్నం పెట్టేదాకా పడండి, కొంచెం భోజనంచేసి పడుకుందురుగాని" అని పిల్లలను బుజ్జగిస్తూ, ఏమే, చిన్నబాబు ఏమైనా పుచ్చుకున్నాడా?" అని పనిమనిషిని అడిగాడు.

"పాలుతాగి పడుకున్నాడు బాబూ" అంది.

పనిమనిషిని వీధివసారాలో వుండమని, కబుర్లు చెబుతూ, పిల్లలిద్దరిచేతా ఎలాగో యింత తినిపించేశాడు. "అమ్మవచ్చేవరకూ మేలుకునే వుంటాం" అంటూనే యిద్దరూ క్షణంలో నిద్రపోయారు. నిద్రలోనే పనివాడు "అప్పచ్చులు తెచ్చావా, అమ్మా" అంటున్నాడు. నిద్రలోకూడా అమ్మనే తలపెడుతున్న పిల్లలస్థితిని చూచేటప్పటికి, రమణారావుకి ధైర్యం పూర్తిగాపోయింది.

పనిమనిషిని పిల్లలవద్ద వుండమని, తిరిగి వెళ్లి వీధివసారాలో కూర్చున్నాడు. మనసును కుదుటపరచే ప్రయత్నంతో తిరిగి పత్రిక తీశాడేకాని చదవడానికి ఏమీబుద్ధికాలేదు.

అంతకంతకూ ఆత్రుత హెచ్చయింది. పోనీ ఊళ్లోకి వెళ్ళి కనుక్కుందామా అనుకున్నాడు; కాని ఎక్కడికి వెళ్ళడం?... ఆసుపత్రివేపు?...ఛాయామాత్రంగా ఆ వూహ తట్టేసరికి నాలిక కొరుక్కున్నాడు. భగవంతుడు మేలుచేసి, తప్పకుండా వచ్చేస్తుంది. అయినా, ఏదేనా ప్రమాదం సంభవిస్తే? ...... పిల్లలతో ఈ సంసారం తానొక్కడూ సాగించగలడా? అన్నే, బొత్తిగా తల్లిచాటు పిల్లలు; ఒక్కఘడియ తల్లి పెరట్లోకి వెళ్ళినా, కనిపించకపోయినా గిలగిలలాడుతారు; అందులో చీకటిపడ్డాక మరీను. అంతా, పదకొండేళ్లొచ్చిన పెద్దబాబుతోసహా, అమ్మదగ్గిరుంటేకాని పడుకోరు. శారద తినిపించినట్టు తను తినిపించగలడా? ఈ కాస్తసేపు శారద లేకపోతేనే యిల్లింత వెలవెలా పోతున్నదికదా, శారద లేకుండా అసలు సంసారం నడవడం సాధ్యమా? పోనీ, పిల్లల్ని అక్కయ్యకేనా ఎవరికేనా అప్పజెప్పినా, శారద లేకుండా తను మాత్రం...ఆ వూహ తట్టేసరికి రమణారావు వొళ్లు చెమటపట్టింది. ఏమిటీ అర్థం పర్థంలేని వూహాలని విసుక్కున్నాడు. కాని ఆత్రుతవల్ల కలిగిన భయంనుంచి, అట్లాంటి వూహలతన్ని కలతపెట్టడం మానలేదు.

శారద లేని తన జీవితానికి అర్థంకాని, లక్ష్యంకాని ఏమీ వుండనట్టనిపించింది. ఈ పదహారేళ్ళ కాపురంలోనూ 'శారదలేని తను' అనే యోచన ఒక్కసారీ కలగలేదు. అటువంటిది ఎంత సంభవదూరమైనా బొత్తిగా అసాధ్యవిషయముకాదని చూచాయగానైనా ఒక్కసారీ తట్టలేదు. అతనికి స్పష్టంగా తెలియరాకుండానే శారద అతని జీవితంలో అతిసన్నిహితంగా, ఒక్కటిగా కలిసిపోయిన అంతర్భాగమయింది.

"ప్రాంగణాన రంగవల్లి
తీర్చిదిద్దు తెలుగుతల్లి!"

చిత్రకారుడు: జి. రామమోహాన్-సికింద్రాబాదు.

ఇన్నాళ్ళూ అంతగా తెలిసిరాని ఈ సత్యస్వరూపం తటాలున గోచరించేసరికి అతనికి విపరీతమైన ఆతృతతోపాటు చాలా ఆశ్చర్యం కూడా కలిగింది.

దైవమలా అన్యాయం చెయ్యకూడదు; కాని దురదృష్టవశాత్తు ఏదేనా విపత్తు సంభవిస్తే...ఏం చెయ్యడం? తండ్రిలేని లోటు కన్న, ఎదుగుతూన్న పిల్లలకు ముఖ్యంగా తల్లిలేని లోపం అసలే భరించశక్యం కాదు. పదహారు పదిహేడేళ్ళు కాపురం చేసిన తరువాత భర్తకైనా భార్యలేని లోపం ఎంతమాత్రం తీరేదికాదు; మరోభార్యను చేసుకున్నా...ఇలాగుంటుందా?...ఛఛ ఏమిటీ అసందర్భపు ఆలోచనలని అసహ్యించుకున్నాడు...కాని తీరా ఏదేనా ప్రమాదం సంభవిస్తే?...తలపెట్టకుండానే అతని మనసులో మరోభార్యతో సంసారం ఎలా [illegible] గలదో అనే విషయమై ఛాయా[illegible] ఊహాలల్లాడసాగాయి. కొత్త స[illegible] సంబంధాలు రెండుమూడు అస్పష్టంగా మనసులో మసలినా, ఫలానా అమ్మాయి అని మటకూ ఎవరినీ శారదస్థానంలో ఊహించడం అసాధ్యమనిపించింది. శారదస్థానం తన జీవితంలో మరెవరు కాని ఆక్రమించడం దుస్సాధ్యం అని అతనికి గట్టిగా తట్టింది. తిరిగి కొంచెం ఆశ్చర్యము కలిగింది. కాని ఈ దరిద్రపు వూహలేమిటి?...ఓయి భగవంతుడా, యిలాటిదుష్ట తెచ్చిపెట్టకు అని

★ కళ్ళెం జారిన గుఱ్ఱం ★

మనసులో ప్రార్థించాడు.

రమణారావు అంత దైవభక్తి గలవాడూ అని చెప్పలేం; నాస్తికుడూ కాదు. శారద ఎప్పుడేనా దేవాలయానికి వెడదాం అంటే వెళ్లడం, ఇంట్లో సంప్రదాయంగా చేసే పర్వాలూ, పూజలూ వంటి వాట్లో యథావిధిగా పాల్గొనడమూ చేసేవాడే కాని మరీ అంత భక్తిశ్రద్ధలు కాని, అనుదినమూ నియమానుసారంగా జపాలూ, ప్రార్థనలూ చెయ్యడానికి గాని అలవాటు పడలేదు. అంత అవసరంకూడా కలగలేదు. సామాన్యమైన ఒడుదుడుకులు మినహా యింతవరకూ కుటుంబ క్షేమం, శాంతి, వ్యక్తిగతంగాకూడా, సుమారుగా అంతా ఏదో సాఫీగానే గడిచిపోతూ వచ్చింది. ఇవాళేమిటి గ్రహచారం, హఠాత్తుగా ఈ విపరీతమైన ఆందోళనా, ఆలోచనలున్నూ! తనకి నలభై రెండో ఏడు మొన్ననే వచ్చింది; వయసు ముదురుతూం దేమిటి చెప్మా? నలభైఏళ్లు దాటేటప్పటికి నరాల పటుత్వంతగ్గి యిటువంటి ఆందోళనా, జంకూ హెచ్చవుతాయి కాబోలు! పిల్లలంతా బాగా ఎదిగేవరకూ అయినా భార్యాభర్తలకు ఏ విధాన్నికాని ఎడబాటు కలగడం చాలా అన్యాయం, అసహజం, అధర్మం...ఏమిటేమిటో అస్పష్టంగా అనుకోసాగేడు దైవాన్నీ, విధినీ ఉద్దేశించి.

ఒక్కసారి మొదటి కాపురం రోజుల మధురస్మృతులు జ్ఞాపకం వచ్చాయి. శారద కప్పుడు పదిహేడేళ్ళు; తనకి యిరవై అయిదు. వివాహానికి పూర్వం శారదను తా నెరగడు. పై వూళ్ళో, దూరప్రాంతంలో చిన్న ఉద్యోగం; జీతంకూడా యిప్పటికంటే బాగా తక్కువే. కాని, ఏ యిబ్బందు లున్నా సద్దుకుని ఎంత బాగా సంసారం దిద్దుకుంటూ వచ్చింది! అప్పుడు యింకా చిన్నగా, నాజూగ్గా వుండేది. ఇప్పుడు పిల్లలు కలిగాక కొంచెం వొళ్లువచ్చింది. కాని ఎప్పుడూ ఒక్కరీతిగానే నవ్వు ముఖంతో మంచి కళగా వుంటుంది. తనకి తెలియకుండానే, ఎప్పటినుంచి చెప్మా తన వంతగా పెనవేసుకొన్న ఆత్మీయురాలూ, సన్నిహితురాలూ అయిపోయిందని చాలా విస్మయపడ్డాడు.' అయితే, తానుకూడా శారదయందు అమిత అనురాగమూ, సౌమ్యతా కలిగే వుంటూ వచ్చాడన్న సంగతిమాత్రం అతనికి స్ఫురించలేదు; ఆమె నిర్వహిస్తున్న బాధ్యతలూ, చూపే ఓపికా, చేసే సంరక్షణా తాను యిన్నాళ్ళూ సరిగ్గా గుర్తించాడూ? అని మాత్రమే తట్టింది. ఈ వూహ తట్టేసరికి, యింత ఆందోళనలోనూ, అతని హృదయం ఏదో కృతజ్ఞతాపూర్వకమైన మధుర వేదనతో నిండిపోయింది.

వారాని కోసారి పట్లూ అవీ దులిపించి ఎంత బాగా యిల్లు సద్దుతుంది! వంటిల్లూ, వట్టిల్లూ అద్దంలా వుంచుతుంది. ఎటొచ్చీ ఆమె బట్టలబీరువా మటుకూ వొట్టి అడివిలా వుంచుతుంది. ఎప్పుడేనా తానే సద్దేవాడు కూడాను. సద్దుతూన్నప్పుడు ఏచీరమడతలోనూ పదిరూపాయలనోటూ, మరో మడతలో వాళ్ళిద్దరిఫొటో, మరో దాంట్లో ఏవో పాతవుత్తరాలు, లేకపోతే పద్దు పుస్తకం, యిలా ఏమిటేమిటో కనిపించడం మామూలే! చీరమార్చి కట్టుకునేటప్పుడు విప్పినచీర దండేన్ని పెట్టడం ఒకటి, సాధారణంగా మరిచిపోతూంటుంది! అట్లాంటివి సంభవించినప్పుడు వుండబట్టలేక రెండు మూడుసార్లు చివాట్లు పెట్టినట్లు కఠినంగా మాట్లాడుకూడాను. పాపం, తననీ,పిల్లలినీ కనుక్కోవడంలో మునిగి ఆమె స్వంత విషయంలో అశ్రద్ధ చేస్తూంటూందేమో? ఇవన్నీ గుర్తించకుండా తాను చిరాకు పడడం ఎంతపొరపాటు! ఎక్కడివస్తువ అక్కడ నీటుగా వుంచాలని చెప్పడమేకాని, తాను మటుకూ మేజాబల్లమీదా, సొరుగుల్లోనూ, పుస్తకాలూ, పత్రికలూ, కాగితాలూ, పెన్సిళ్లూ చిందరవందరగా వుంచడంలేదూ? ఫౌంటెన్ పెన్నో, రిస్టువాచీనో కనపడక అందర్నీ చీదరించుకొని నానా హంగామా చేసేటప్పుడు, ఎన్నిసార్లు శారద ఏ పుస్తకం మరుగునుంచో, ఏ సొరుగు మూలనుంచో వెతికి నెమ్మదిగా తనకిచ్చేదికాదు. కాని ఎప్పుడేనా తనవలె విసుక్కుందా? ఆమె తనయందు చూపే నిర్మల విశ్వాసానికీ, సౌహార్దానికీ, తగిన ఆదరణా, అభిమానమూ తాను చూపుతూ వచ్చాడా? ఇకముందెప్పుడూ, ఏమయినా సరే, ఆమెమీద చిరాకు పడకూడదనీ, యింకా బాగా కనుక్కోవాలనీ నిశ్చయం చేసుకున్నాడు, రమణారావు.

పై వూళ్ళో వుంటున్నప్పుడు తానొకసారి సుస్తీపడటం గుర్తుకొచ్చింది. మరీ అంత హెచ్చుజ్వరం ఏమీకాదు, కాని వారం రోజులు పక్కమీదే వున్నాడు. జ్వరం వదలి తానింకా నీరసంగా వున్నప్పుడు, ప్రక్కనే కూర్చున్న శారద చేతులు పట్టుకుని "రాత్రిళ్ళుకూడా నువ్వు నిద్రపోవడం లేదు. యిలా అయితే బడలిక చేస్తుంది. పాపం, నీకు తీరికే వుండడం లేదు. ఓసారి మీ స్నేహితుల దగ్గిరకో, సమాజానికో వెళ్లి రాకూడదూ?" అన్నాడు. ఆమె విస్మయపడ్డట్టు. "మీరింకా కులాసాగా లేచి తిరక్కుండానే నేను సమాజానికా! మీరు హాయిగా వుంటేనే అన్నీను" అంది. కాస్త విషాదచ్ఛాయలతో కూడిన ఆమె అమాయకపు ముఖం; యిప్పటికీ తనకి కళ్లలో కట్టినట్టుంది. తాను, నవ్వుతూ, "నువ్వూ పిల్లలూ ఎప్పుడూ కులాసాగా వుండాలి. నా మాటకేం? ఏదో నాలుగు రాళ్లు తెచ్చి పడెయ్యడంకంటె నేను చేస్తున్న నిర్వాకమేమిటి. బాధ్యతంతా నిర్వహిస్తూ అన్నీ నువ్వే చూసుకుంటున్నావు". అన్నాడు. ఆమె నొచ్చుకున్నట్టుగా "అదేమిటండీ! మీరు కులాసాగా వుంటేనే మా కందరికీ కులాసా. మీరు కష్టపడి ఏ యిబ్బందీ లేకుండా చూస్తూండబట్టేకదా సంసారం చక్కగా, ఏచింతా లేకుండా దిద్దుకుపోతూంది. నేను చేస్తున్నపాటి అంతా చేస్తారు. మరింత చెయ్యగలను; మీరు బాగుంటేనే నాకు ఏనుగంత బలం" అంది. ఈ మాటలు జ్ఞప్తికి వచ్చి, రమణారావుకి సిగ్గు వేసింది; నవ్వుకూడా వచ్చింది. నిజానికి, తానిన్నాళ్ళూ గుర్తించలేకపోయాడు కాని, శారద క్షేమంగా తన పక్కనుంటేనే తనకు ఏనుగంత బలం!

మొదటి తాత్కాలిక ఉద్యోగం అయిపోయి, మళ్ళీ ఏదేనా ఉద్యోగానికి ప్రయత్నిస్తూ తాను మూడు నెలలు నిరాశతో అవస్థపడ్డప్పుడు తన కెంత ధైర్యం చెప్పేది! "అందరికీ ఉద్యోగాలే వున్నాయా; ఉద్యోగం లేకపోతేమటుకూ హాయిగా బ్రతకలేమా? చదువుకున్నారు; మంచితనంవుంది. ఇది కాకపోతే యింతకంటే మంచిది మరొకటి దొరుకుతుంది. కొన్నాళ్ళు వెళ్లి మా గ్రామంలో వుందాము; లేదూ, అట్టే మదుపు అవసరంలేని చిన్న వ్యాపారమేదేనా పట్నంలో పెట్టుకోవచ్చు. ఇంత మాత్రానికే అధైర్యపడతారేమిటి?" అంటూ తన నగలనుకూడా ఎట్టి శంకా లేకుండా ఇవ్వచూపింది! ఆమె మాట మహాత్మ్యం లాగునే తాననుకున్నకంటే మంచి ఉద్యోగమే లభించింది. తరువాత ఖాయమయి ప్రమోషనుకూడా వచ్చింది. నిజంగా శారద తన అదృష్టదేవతే! ఇప్పుడన్నీ కలిసి యించుమించు నాలుగు వందలు జీతం; అంతా బాగానే వుంది. కాని నాలుగు కాదు, ఎనిమిది వందలు జీతం అయితేమటుకు శారద క్షేమంగా లేకపోతే పిల్లలికి కాని, తనకి కాని ఎలా జరుగుతుంది? వీటన్నిటికీ అర్థం, విలువా ఏముంటుంది?

గూట్లో రాధాకృష్ణ విగ్రహం దగ్గిర

(46-వ పేజీ చూడండి)

★ కళ్లెం జారిన గుఱ్ఱం ★

(8-వ పేజీ తరువాయి)

రోజా సంజవేళప్పుడు ఆమె అగరువత్తి వెలిగించి నమస్కరిస్తుందని చటాలున గుర్తొచ్చింది. వెంటనే వెళ్ళి, అగరువత్తి వెలిగించి చేతులు జోడించి నమస్కరించి, "ఎప్పుడూ ఎట్టి ఆపదరాకుండా శారదను కాపాడు; క్షేమంగా యింటికిచేర్చు" అని ప్రార్థించాడు. ఇంతసేపై అగరువత్తి వెలిగించడం మాట గుర్తుకురానందుకు నొచ్చుకున్నాడు. పోనీ, భోజనాలింకా కాలేదుకదా అని సమాధానపడుతూవచ్చి వరాండాలో తిరిగి కూర్చున్నాడు. అప్పుడే ఓ రిక్షా వచ్చి వాకిట ముందాగింది. శారదేమో నని తొందరగా, ఆనందంతో లేచాడు. కాని, "నమస్తే బాబుగారూ! మంచి నాణ్యమైన వెంకటగిరి, మధుర, కంచిచీరెలు తీసుకొచ్చాను, చూస్తారా? తిరిగి బనారసు వెళ్ళిపోతున్నాను. బాబుగారు తీరికగా వున్నారని రిక్షా ఆపాను. అమ్మగార్ని పిలిపిస్తారా?" అంటూ, రిక్షా దిగి, ఓ ఆసామీ వచ్చాడు. "ఇంట్లో లేరు; ఊళ్ళోకి వెళ్లారు" అన్నాడు ప్రశాంతంగా. "లేపోతున్న రమ్మంటారా? మంచి ప్రశస్తమైన చీరెలు బాబుగారూ" అన్నాడు బట్టలు తెచ్చినతను. తటాలున ఏదో జ్ఞాపకం వచ్చి "సరే, చూస్తాను" అన్నాడు. చీరెలతను పెట్టె తెప్పించాడు.

రమణారావుకు జ్ఞాపకం వచ్చిన సంగతి యిది: ఆమధ్యకూడా ఎవరో యిలాగే బెంగళూరు చీరెలని తస్తే, చూదామా అన్నట్టు యితనివేపు శారద చూసింది. కాని తాను, 'బీరువాలో చీరెలకి చోటు యిప్పుడే లేదు. యింకా కావాలిట!' అని నవ్వుతూ అనేశాడు. నొచ్చుకుందో ఏమో తెలియదుకాని ఆమెకూడా నవ్వేసి వూరుకుంది పాపం, సరదాపడిందేమో; ఎందుకలా అనేశాడో మరి! అగ్రెండటి సంవత్సరం, తనకి తెలియకుండానే, ఎంత మంచి పేంటూ, షర్టూ కొలతలూ అవీ జాగ్రత్తగా చూచి తన పుట్టిన రోజుకి కుట్టించింది! తాను వచ్చేమాసంలో ఊలు సూటు కుట్టించుకుందామని వేళ వుంచిన మూడురూపాయలసంగతికూడా జ్ఞాపకం వచ్చింది. అదికాకుండా, ఈ మాసంలోనే వాళ్ళ వివాహదినం వస్తుంది! అందుచేతనే చీరలతన్ని వుండమన్నాడు. ఆ నల్లంచు, వంగపండూ, నేరేడు పండూ రంగుల సిల్కు చీర కట్టుకుంటే శారద ఎంత బాగుంటుంది! అదంటే ఆమెకి చాలా సరదా. పెళ్ళిలో తనవాళ్ళు పెట్టిన మూడు సిల్కు చీరల్లో అది తనే సెలెక్టు చేశాడు. మొన్న మొన్నటివరకూ బాగానే వుంది. యిప్పుడిప్పుడే అంచులదగ్గర చిరుగుతూంది. కాంతివంతమైన ఆమె చాయకు అట్లాంటి దట్టమైన రంగు నల్లంచు చీర చాలా బాగుంటుంది...

చీరెలతను మడతలు విప్పుతున్నాడు. సరిగ్గా తనకు నచ్చిన చీర కనిపించింది. రంగూ, అంచూ నేతా అన్నీ బాగున్నాయి. పొడుగూ, వెడల్పూ కూడా శారదకు సరిపోయేవే. అటువంటి చీరంటే తప్పకుండా ముచ్చటపడుతుంది. ఖరీదుచేసి, ఎనభైరెండు రూపాయలిచ్చి కొనేశాడు, మరో పద్దెనుగు రూపాయలకు చీరకు కుదిరే బాడీ గుడ్డ కూడా తీసుకున్నాడు, మనసుకుచాలా సంతృప్తి కలిగింది. అవి లోపలపెట్టి, తిరిగి వసారాలో కొచ్చే సరికి మరో రిక్షా యింటి ముందాగింది.

అనుకున్నట్టుగానే శారదే అందులోంచి దిగింది.

"హమ్మయ్య" అనుకుంటూ, గబగబ మెట్లు దిగి నవ్వుతూ ఆమె చేతిలోని సంచీ అందుకొని, చిల్లరకోసం ఆమె తడుముకుంటూంటే, 'నా దగ్గిరుందిలే' అంటూ తనే పర్సుతీసి రిక్షావాడికి అర్ధరూపాయ యిచ్చాడు. ఆమె కొంచెం ఆశ్చర్యంతో, "ఎంతిచ్చారేమిటి? అరణా లే" అంది. "పోనీలే ఆలస్యం అయింది, మరో రెండణాలేమిటి" అనేశాడు.

శారద యింట్లో ప్రవేశిస్తూ, "చాలా ఆలస్యం అయిపోయింది. పిల్లలూ, మీరూ భోజనంచేశారా? కాస్తలా తిరిగివచ్చారా? సమాజానికి వెళ్ళకుండానే వచ్చి కలిసింది. ఒక్క నిమిషం మొహం చూపించి వచ్చేద్దా మనుకుంటే నలుగురు కమిటీమెంబర్లూ జతపడ్డారని మీటింగు పెట్టేశారు. ఎంత వచ్చేద్దామన్నా వద్దంటే! ఇందిరావాళ్ళూ, 'మాకు మటుకు యింట్లో పనులేవేమిటి; ఎప్పుడైనా కాస్త ఆలస్యమవుతుంది మరి' అంటూ బలవంతపెట్టి కూర్చోపెట్టేశారు. ఇందిరకేం! ఇంట్లో అత్తా, ఆడబడుచూ కూడా వున్నారు. గ్రహించుకోరండీ యిబ్బందులు" అంటూ, ఆలస్యమయిందనే ఆందోళనతో భర్తకు సమాధానం చెప్పేతీరులో చెప్పుకుపోసాగింది. రమణారావు సరదాగా మాట్లాడుతూ ఆమె వెనకాలే వెళ్లాడు. "అయ్యో! మీరింకా భోజనం చెయ్యలేదూ? ఎందుకున్నారూ?" అంటూ పెరట్లోకి వెళ్ళింది. రమణారావు అంతసేపూ పెరటివసారాలో నిలబడి సంభాషణ సాగిస్తూనే వున్నాడు. ఆమె కాళ్ళూ చేతులూ, ముఖమూ కడుక్కొని, తొందరగా చీర మార్చుకుందుకు గదిలోకొచ్చేటప్పుడు కూడా ఏదో చెబుతూనే వెంబడించాడు. ఆలస్యం అయినందుకు చిరాకుపడకుండా యింత వుల్లాసంగా వుండడం శారదకు విస్మయం కలిగిస్తూంది.

పిల్లలంతా నిద్రపోతున్నారు; దాసీది కునుకుతీస్తూంది. రమణారావు, "మనం భోజనంచేశాక దాన్ని లేపొచ్చునులే; వీధి తలుపు వేసొస్తా" అంటూ వెళ్ళి, నట్టింట్లోకి వస్తున్నప్పుడు తను కొన్న చీరమాట జ్ఞాపకం వచ్చి, యిప్పుడే చూపిద్దామా, భోజనం చేశాక చూపిద్దామా, అని ఒక్క క్షణం తటపటాయించి, వుండబట్టలేక కాగితంలో కట్టిన పార్సెలును తీసుకునే వెళ్లాడు. శారద యిద్దరికీ వడ్డిస్తూ, "కూచోండి" అంది. "అలాగే కాని, యిదేమిటో చెప్పుకో చూదాం" అన్నాడు పార్సెలు చూపిస్తూ. శారద ఆశ్చర్యంతో ఏమిటన్నట్టు చూచింది. చీర మడతవిప్పి అంచులున్న వేపు చూపించాడు. శారదకళ్ళు ఆనందంతోనూ, ఆశ్చర్యంతోనూ మెరిశాయి.

"చాలా బాగుంది; ఎక్కడిదేమిటి?" అంది.

"ఇందాక ఒకతను తెస్తే, నీకు బాగుంటుందనిపించి తీసుకున్నాను. నచ్చిందా?" అన్నాడు, ఆప్యాయంగా చూస్తూ.

"చాలా థరఅయి వుంటుందే; బోర్డరూ, రంగూ, అదీ చాలా బాగున్నాయి; యిలాంటిదే కొనుక్కోవాలని వుంది. సరిగ్గా ఏలా కనుక్కున్నారో! అయినా యిప్పుడెందుకూ యింత ఖరీదుపెట్టి? ఇదేమిటి,

---

చెల్ తమాషా

బహూకరించారు.

చల్ తమాషాతో జమీందారుగారిని మెప్పించిన వర్తకుణ్ణి అంతా పొగిడారు. గౌరవ మర్యాదలతో వర్తకుణ్ణి సాగనంపారు జమీందారుగారు. ఆ పంచకళ్యాణి మీదే జమీందారుగారికి మోజు.

అంతా రానురాను ఆ గుఱ్ఱాన్ని 'చల్ తమాషా' అని పిలుస్తూంటే జమీందారుగారికి వర్తకుడు నేర్పిన పాఠం చటుక్కున జ్ఞాపకం వస్తూండేదిట. ఇప్పటికీ ఆ గుఱ్ఱం పేరు 'చల్ తమాషా'గానే చలామణీ అవుతూంది. ★

"బాడీసు కుడ్తకూడానా! ఇవన్నీ ఎందుకు కొన్నారూ?" అంది విస్మయానందంతో. రమణారావుకి చాలా సంతృప్తి కలిగింది. "ఎంతయితే నేమిటె, నీకు నచ్చాయి కదా రెండూను" అంటూ అవి పక్కమీద పెట్టి, వచ్చి భోజనానికి కూర్చున్నాడు. సరదాగా కబుర్లు చెప్పుకుంటూ యిద్దరూ భోజనం చేశారు.

భోజనాలయాక శారద తాంబూల మందిస్తున్నప్పుడు "దేముడిదగ్గర అగరువత్తి వెలిగించానులే" అన్నాడు. "చూశారా మరిచేపోయాను తొందరలో, జ్ఞాపకం వుంచుకున్నారే. పాపం, పిల్లలతో మీకు చాలా యిబ్బందయి వుంటుంది. ఇలా ఆలస్యం అయే మాటుంటే సమాజం మానేస్తాను" అంది. అది వినిపించుకున్నాడో లేదో కాని, "చాలా రోజులయినట్టుంది. రేపు కోదండరామాలయానికి వెడదామా?" అన్నాడు. "అలాగే" అని శారద అతనివేపు వింతగా చూసి, "పనిమనిషికి అన్నం పెట్టి వస్తానిప్పుడే" అంటూ లోనికి వెళ్ళింది.

రమణారావు పరధ్యానంగా చూస్తూ పడకకుర్చీలో కూర్చున్నాడు. శారద రాగానే లేస్తూ, మంచంపక్కన చిందరవందరగా పడివున్న ఆమెచీరను చూశాడు. ఇందాక తొందరగా ఆమె చీర మార్చుకుంటూ కింద వదిలేసింది. అది చూడగానే "నీ కెన్నిసార్లు చెప్పినా అంతే; ఎక్కడ పడితే అక్కడ విడిచినచీర పడెయ్యడమే" అన్నాడు—తటాలున, అనుకోకుండా కలిగిన చిరాకుతో! శారద సిగ్గుతో నొచ్చుకుంటూ, "మీకు ఆలస్య మవుతుందని తొందరపడుతూ మరిచి పోయానండీ; తప్పే" అంది చీరతీసి మడత పెడుతూ.

అంత ఆలస్యం అయినా ఏమి విసుక్కోకుండా కులాసాగా కబుర్లు చెప్పడం, మంచి చీరే బాడీసూ అనుకోకుండా తన కోసము కొనడమూ, తనపట్ల చూపిన ఆత్మీయతా, యింతలోనే రోజూ జరిగే సామాన్యమైన చిన్న పొరపాటుకు ఒక్కసారి చిరాకుపడటం— ఈ ధోరణి శారదకేమీ అర్థం కాలేదు.

పెళ్ళి పీటలమీద వేసిన మూడు ముళ్లూ భార్య నెంతవరకూ బంధిస్తాయో చెప్పలేం కాని, చాలామంది భర్తల నవి కళ్లెం వేసిన గుఱ్ఱం మాదిరిగా మచ్చికచేస్తవి! ఆ కళ్లెం వుంటేనే సంసారంలో నిలకడా, నిశ్చింతతో కూడిన గమనం, లక్ష్యం చాలామంది పురుషుల కలవడతాయి! ఒకరు వదులుతుంటేనే పరుగెట్టడాని కలవాటు పడ్డ గుఱ్ఱానికి, కళ్లెం జారితే బహుశా స్వేచ్ఛానుభవం కొత్త కంగారే హెచ్చువవచ్చు. చెదిరి చెంచేలుపడ్డ మనసుతో రమణారావు యింత సేపూ పడిన ఆరాటం శారదకేం తెలుసుంది పాపం! ఆమె పేరంటాలనుంచి వచ్చిన కొద్ది సేపట్లోనే తిరిగి కళ్లెం పడటంవల్ల, మామూలు ధోరణిలో చిరాకు పడ్డాడు రమణారావు!

శారద చీర దండేన్నివుంచి భర్తవేపు యింకా వింతగానే చూస్తూ, "ఇంకెప్పుడూ కిందలా వదిలేను లెండి" అంది. ఇంతసేపటి ఆందోళనా, కాస్త సేపటికిందే చేసుకున్న నిశ్చయం కూడా మరిచిపోయి, ఆమెపై అలా చిరాకుపడ్డందుకు సిగ్గుతో, "అబ్బే, మరేంలేదు; పురుగూ పుట్రా అందులో చేరగలవనీ కింద వదిలేస్తే; పోనీ మంచం మీదేనా పడేసూండు" అన్నాడు మెల్లగా ఆమెచేయిని తన చేతిలోకి తీసుకుంటూ! ★

న్యూఢిల్లీ లేఖ

(10-వ పేజీ తరువాయి)

వచ్చింది. ఒక గడ్డుదశ నుంచి ఇంకో గడ్డుదశకు గెంతుతూ వచ్చింది. ఈలోగా ఆర్థిక వ్యవస్థ నానాభ్రష్టూ అయింది; ప్రజలలో నిస్త్రాణ హెచ్చింది. అధ్యక్షుడు సుకర్నో, ఉపాధ్యక్షుడు హట్టా ఘర్షణపడి, డా॥ హట్టా రాజీనామా చేయడంతో పరిస్థితులు అస్తవ్యస్తమయిపోతున్నాయని మొట్టమొదటిసారిగా వెల్లడయింది. ఆతరవాత సుమత్రా, బోర్నియో, సెలిబస్ లలో కొన్ని కొన్ని చోట్ల మిలిటరీ అధికారులు స్వతంత్ర రాష్ట్రీయ ప్రభుత్వాలను స్థాపించుకోవడం జరిగింది. విశాలమైన ఇండొనీషియా దేశంలోని దూరదూర ద్వీపాలన్నిటికీ జకార్తా ప్రభుత్వం ప్రాతినిధ్యం వహిస్తోందనిగాని, పరిపాలిస్తోందనిగాని నమ్మించడం కూడా ఇక సాధ్యంకాదు. జాతీయైకమత్యాన్ని పునరుద్ధరించడానికి ఇంకో కొత్త నాటకం ఆడవలసి వచ్చింది. అధ్యక్షుడు సుకర్నో "కొత్తరకం ప్రజాస్వామ్యం" పేరుతో ఈ నాటకం ఆడారు. ఇండొనీషియన్ జాతీయత ఛిన్నాభిన్నం అవుతున్నా ఆయన పట్టించుకోలేదు. గత ఏప్రిల్లో డా॥ జువాందాను పార్లమెంటుకు సంబంధంలేని ప్రభుత్వాన్నేర్పరచమని అధ్యక్షుడు కోరారు. జాకలో జాతీయ సలహామండలి అవతరించింది. విడిపోయిన ద్వీపాలను తిరిగి కూడగట్టుకోడానికి చేసిన ప్రయత్నాలు విఫలంకావడంతో జకర్తాలో ఒక జాతీయ సమావేశం ఏర్పాటుచేశారు. ఇటీవల జాతీయ అభివృద్ధిమండలి సమావేశం అంటూ ఇంకొకటి జకర్తాలో జరిగింది.

ఇండొనీషియాలో ఉన్న ఇబ్బందులన్నీ గుర్తుపెట్టుకుంటే ఆశయాలు ఆచరణలోకి రాకపోయినందుకుగాని, ఆడిన నాటకం ఎవర్నీ నమ్మించలేక పోయినందుకుగాని ఆశ్చర్యం కలగనే కలగదు. విచారపడవలసిన విషయమల్లా ఏమిటంటే జాతీయతను బలపరచడం కోసమని విద్వేషభావాన్ని రేకెత్తించడం. సమాధానపడడం ద్వారా ఏకమత్యం కుదర్చలేకపోతే, ఎవరిమీదో ఒకరి మీద ద్వేషం రెచ్చగొట్టడం ద్వారా కుదర్చడమనేది చాల కాలంగా స్వాతంత్ర్యోద్యమాలన్నీ అనుసరిస్తున్న పద్ధతే."

పాకిస్తాన్ ఏర్పడినప్పటినుంచీ భారత పాకిస్తాన్ సంబంధాలను గమనిస్తున్న వారందరికీ ఇదే విధమైన పద్ధతి భారత సరిహద్దుల కవతల కూడా అనుసరిస్తున్నారని విదితమవుతుంది. పాకిస్తాన్ ప్రభుత్వం చిక్కుల్లో పడినప్పుడల్లా భారత విద్వేషగీతాల బృందగానం హోరెత్తిపోతుంది.

పాకిస్తాన్ లోనూ, ఇతరత్రా భారతదేశానికి వ్యాపార ప్రయోజనాలున్నాయి గనుక ఈ విషయమై కొంత ఆసక్తి వహించడం అవసరం. ఇండొనీషియాలో డచ్చి వారి ఆస్తులను వశపరుచుకోడంవల్ల, వెనుకబడిన దేశాలలో విదేశీయుల పెట్టుబడి అవకాశాలు దెబ్బతినిపోతాయి. ఇంతమాత్రాన డచ్చి వలసవిధానాన్ని సమర్థిస్తున్నానని అర్థంకాదు. న్యూగినీ ప్రజల అభిమతాలను గూర్చికూడా ఆలోచించాలిగదా? ఈ పరిపాలకులు పోయి ఆ పరిపాలకులు రావడం న్యూగినీ ప్రజలకు ఇష్టం లేకపోవచ్చు. స్వతంత్రంగా ఉండడమే వారి అభీష్టం కావచ్చు. న్యూగినీ ప్రజలకూ, ఇండొనీషియన్లకు అంత అనుబంధం ఏమున్నది గనుక? భారతదేశం నిస్సందేహంగా సామ్రాజ్యవాద వ్యతిరేక దేశమే. కాని అలాగని చెప్పి న్యూగిని ప్రజలకు ఇష్టంలేని పరిపాలనను వారి నెత్తికి అంటగట్టడానికి భారతదేశం సమ్మతిస్తుందా? ★

సిక్కిం లాటరీ

టిక్కెట్టు రు. 1-10-0.

టిక్కెట్లు ఎత్తు తేది 31-1-58

టిక్కెట్లు అమ్మట ముగింపు

తేది 31-12-57

మొదటి ప్రయిజు రు. 55000; రెండవ ప్రయిజు రు. 14000; మొత్తం ప్రయిజులు 500; ప్రయిజుల మొత్తం రు. 100000 లకు పైన 2 టిక్కెట్లు రు. 3-2-0; 3 టిక్కెట్లు రు. 4-6-0; 4 టిక్కెట్లు రు. 5-10-0. వి. పి. లేదు. ఆలస్యముగా వచ్చు ఆర్డర్లు అంగీకరించబడవు. మీ అడ్రసును మనియార్డరు ఫారముపై పెద్ద అక్షరాలతో వ్రాయండి. ఫలితముల లిస్టు కొఱకు 1 అణాను ఎక్కువ పంపండి. నేడే పంపండి. వి. రామకృష్ణ.

అనుమతి పొందిన ఏజెంటు:
పాండురంగాశయవీధి, యాడికి, ఆంధ్ర.